సాక్షి మహబూబ్‌నగర్

సోమవారం । 20 । ఫిబ్రవరి । 2023



ఉత్సాహంగా క్రికెట్ టోర్నీ

గోర్ బంజారా ప్రీమియర్ లీగ్ స్పోర్ట్స్ సొసైటీ క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా ప్రారంభమైంది.

వివరాలు 10లో ▸



ఇథనాల్ కంపెనీతో కలుషితం

ఇథనాల్ కంపెనీతో జలాలు కలుషితమవుతాయని హెచ్‌సీయూ ప్రొఫెసర్లు అన్నారు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.6 /18.2

ఉదయం శీతల గాలులు వీచే అవకాశం ఉంది. రోజంతా వాతావరణం సాధారణంగా ఉంటుంది. ఎండ ప్రభావం చూపిస్తుంది.

న్యూస్‌రీల్

హజ్‌యాత్రకు సొసైటీ ద్వారా ఆన్‌లైన్ సేవలు



స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రస్తుత 2023 సంవత్సరంలో వెళ్లే హజ్ యాత్రికుల దరఖాస్తులను జిల్లా హజ్ సొసైటీ ద్వారా ఆన్‌లైన్ చేస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహమూద్‌అలీ, ఎండీ మేరాజుద్దీన్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మోటార్‌లైన్ వక్ఫ్ కాంప్లెక్స్‌లోని హజ్ సొసైటీ కార్యాలయంలో పలువురికి ఆన్‌లైన్ దరఖాస్తులు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి హజ్‌యాత్రకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తులు చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే నెల 10 చివరి తేదీ అని, హజ్‌యాత్రకు వెళ్లేవారు తమ సొసైటీ కార్యాలయంలో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర సర్టిఫికెట్లతోపాటు రెండు డోసుల కరోనా వ్యాక్సిన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా జతపరచాలని కోరారు. పూర్తి వివరాల కోసం హజ్ సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో ఖాజా నిజాముద్దీన్, సత్తార్, అర్షద్ అలీ, హైదర్‌అలీ, రఫీక్, ఫైజొద్దీన్, అయూబ్ పాషా, సయ్యద్ నిజాముద్దీన్ పాల్గొన్నారు.

సభ్యత్వం తీసుకోండి

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాలోని కరాటే మాస్టర్లు, ఫౌండర్లు తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డూ అసోసియేషన్‌లో వచ్చే నెల 15లోగా సభ్యత్వం తీసుకోవాలని మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ కరాటేడూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్, ఉమ్మడి జిల్లా టోర్నమెంట్ కమిషన్ చైర్మన్ కృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 15 తర్వాత తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డూ అసోసియేషన్‌కు అనుబంధమైన మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ కరాటేడూ అసోసియేషన్ పూర్తి కార్యవర్గాన్ని ప్రకటిస్తామని చెప్పారు.

ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

జడ్చర్ల టౌన్: ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో నిరుద్యోగ యువతీ, యువకులకు ఆస్పత్రుల్లో పనిచేసే కోర్సుల్లో 3 నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలంగాణ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఫర్ నర్సెస్ ప్రాజెక్ట్ మేనేజర్ సైదులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18- 35 ఏళ్లలోపు యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని, వారికి ఉచిత భోజన సదుపాయంతో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణలో జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, ఫార్మసీ అసిస్టెంట్, డెంటల్ అసిస్టెంట్ కోర్సులకు పదో తరగతి ఉత్తీర్ణత, డయాలసిస్ టెక్నీషియన్ కోర్సుకు ఇంటర్ పూర్తి చేసి ఉండాలన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన నిరుద్యోగులు జడ్చర్లలోని తమ కార్యాలయంలో గాని సెల్ నం.70132 81835లో గాని సంప్రదించాలని సూచించారు.

ఐక్యంగా హక్కులు సాధించుకుందాం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): తమకు దక్కాల్సిన న్యాయమైన హక్కుల సాధన కోసం మాజీ సైనికులు ఐక్యంగా పోరాటం చేసి సాధించుకుందామని మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మాజీ సైనికుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సైనికులకు ప్రభుత్వం ఇచ్చే భూమి, ప్లాట్లకు ఎన్‌ఓసీ ఇవ్వాలని, రిటైర్డ్ అయి వచ్చే మాజీ సైనికులకు ప్లాట్లు కేటాయించాలని, విద్య, ఉద్యోగాల్లో ఇప్పటి వరకు ఉన్న 2 శాతం రిజర్వేషన్లను 5 శాతానికి పెంచాలని, జిల్లా కేంద్రంలో మాజీ సైనికుల కమిటీ హాల్ కోసం ప్రభుత్వం స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈసీహెచ్ అందుబాటులోకి తెచ్చి ప్రైవేట్ ఆస్పత్రులకు అనుసంధానం చేయాలని, డీజీఆర్ పేమెంట్ సౌకర్యం కల్పించాలన్నారు. తమ హక్కుల సాధన కోసం ఈ నెల 26న హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో దీక్ష చేపడుతున్నామని, మాజీ సైనికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి నాగేశ్వర్, నాయకులు రాములు, ఎంఆర్‌కే రెడ్డి, నిరంజన్‌రావు, రాజవర్ధన్‌రెడ్డి, నరేందర్, ఆంజనేయులు, వెంకటయ్యగౌడ్, పుల్లయ్య, చంద్రశేఖర్, రామేశ్వర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వరికే మొగ్గు

జిల్లాలో గణనీయంగా పెరిగిన యాసంగి విస్తీర్ణం

- 1.14 లక్షల ఎకరాలకుపైగా వరి సాగు
- తగ్గిన వేరుశనగ.. పెరిగిన మొక్కజొన్న పంట
- ఆరుతడి పంటలపై ఆసక్తి చూపని రైతులు
- పంటల వివరాల నమోదు



మహబూబ్‌నగర్ రూరల్ మండలం బొక్కలోనిపల్లి శివారులో సాగైన వరిపంట

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): ఆరుతడి పంటల కంటే వరి సాగుపైనే రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఒకప్పుడు తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్న జిల్లాలో.. ప్రస్తుతం సమృద్ధిగా వర్షాలు కురవడంతో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. భూగర్భజల మట్టాలు సైతం గణనీయంగా పెరిగాయి. నీటి లభ్యత పుష్కలంగా ఉండడంతో రైతులు వరి వైపే మొగ్గు చూపారు. గతేడాది యాసంగిలో 99,179 ఎకరాల్లో వరి సాగు కాగా.. ఈ ఏడాది 1,14,322 ఎకరాల్లో వరి పండిస్తున్నారు. గతేడాదితో పోలిస్తే సుమారు 15,143 ఎకరాల్లో అధికంగా సాగు చేశారు. ఒకదిక్కు ఆరుతడి పంటలపై విస్తృతంగా అవగాహన కల్పించినప్పటికీ రైతులు మాత్రం సంప్రదాయ పంటల వైపే మొగ్గు చూపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వమే గ్రామ గ్రామాన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరించడంతోపాటు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తుండడంతో వరిసాగు విస్తీర్ణం పెరిగింది. ఇదిలా ఉండగా ఆరుతడి పంటల సాగు గణనీయంగా తగ్గింది. మొక్కజొన్న, వేరుశనగ, ఇతర పంటలు కలిపి 16,869 ఎకరాల్లో వేశారు. వాణిజ్య పంటలకు ప్రభుత్వం రాయితీలు ఇస్తున్నా ఎక్కువ మంది రైతులు వరి వైపే మొగ్గు చూపుతున్నారు.


1,63,500 ఎకరాల అంచనా..

గత యాసంగితో పోలిస్తే ఈ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. మరోవైపు కొంతమంది మాత్రమే ఆరుతడి పంటలు వేశారు. రాష్ట్ర ప్రభుత్వం అవగాహన కల్పించినా రైతులు వరి వైపే మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది యాసంగిలో అన్ని రకాల పంటలు కలిపి మొత్తం 1,63,500 ఎకరాల్లో సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేయగా.. ఇప్పటి వరకు 1,31,191 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. గతేడాది యాసంగిలో 1,27,998 ఎకరాల్లో పంటలు సాగు కాగా.. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 1,31,191 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. గత యాసంగితో పోలిస్తే సుమారు 3,133 ఎకరాల్లో అధికంగా పంటలు సాగయ్యాయి.

ధరలు నిలకడగా లేక..

వరి, మొక్కజొన్న, వేరుశనగ పంటలకు డిమాండ్ పెరగడంతో మార్కెట్‌లో మంచి ధర వస్తోంది. దీంతో రైతులు ఇవే పంటలను సాగు చేస్తున్నారు. గతేడాది యాసంగితో పోలిస్తే ఈసారి ఆరుతడి పంటల సాగుపై ఆసక్తి కనబర్చడం లేదు. తద్వారా ఆరుతడి పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. జొన్న, పప్పుదినుసులు, పొద్దుతిరుగుడు, వేరుశనగ, నువ్వుల సాగు తగ్గిపోయింది. మార్కెట్‌లో ఆరుతడి పంటల ధరలు నిలకడగా లేకపోవడం కూడా పంటలు సాగు చేయకపోవడానికి కారణమని చెప్పవచ్చు. సంప్రదాయబద్ధంగా.. సులభంగా చేతికొచ్చే వరి పంట సాగు చేయడానికి రైతులు మొగ్గు చూపుతున్నారు.

యాసంగిలో పంటల సాగు వివరాలు



గతేడాది పోలిస్తే పెరిగిన సాగు : **3,133 ఎకరాలు**

ఇతర పంటలు వేయాలి



ఏటా వానాకాలం, యాసంగిలో రైతులు సులభంగా చేతికొచ్చే వరి పంటనే సాగు చేస్తున్నారు. ఆరుతడి పంటలైన పప్పుదినుసులు, కూరగాయలు, ఇతర పంటలను కూడా సాగు చేయాలి. మార్కెట్‌లో మంచి ధర వచ్చే పంటలు చాలా ఉన్నాయి. రైతులు పంట మార్పిడి పాటిస్తూ లాభాలు వచ్చే ఇతర పంటలు వేసేందుకు ప్రయత్నించాలి. జిల్లాలో యాసంగి పంటల సాగు విస్తీర్ణంపై సర్వే చేసి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం.

– వెంకటేష్, జిల్లా వ్యవసాయాధికారి

బోరులో నీళ్లు బాగున్నాయి



ప్రతిఏటా వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో భూగర్భజలాలు సైతం పెరిగాయి. కాలం బాగుంటే మా పొలంలో వరి తప్ప ఇతర ఏ పంట వేసినా చేతికొచ్చే పరిస్థితి ఉండదు. ఒకవేళ పంట మార్పిడి చేసినా దిగుబడి తగ్గుతోంది. నాకున్న పొలంలో వానాకాలంలో కూడా వరి పంటనే సాగు చేసా. వరి పండిస్తే ధాన్యం అమ్ముకోవడానికి మార్కెట్ ఇబ్బంది అంటూ ఏమీ ఉండదు. ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది కాబట్టి యాసంగిలోనూ వరి సాగు చేస్తాను.

– సాయిలు, రైతు, రామచంద్రాపూర్, మహబూబ్‌నగర్ రూరల్

అమ్ముకోవడానికి ఇబ్బందే..



ప్రభుత్వమే మద్దతు ధరకు వరి ధాన్యం కొంటుంది కాబట్టి వరి పంటనే సాగు చేశాను. ఇతర పంటలు సాగు చేస్తే ఆ పంటను అమ్ముకోవడానికి మార్కెట్ పరంగా ఇబ్బందిగా ఉంది. ప్రస్తుతం బోర్లలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. వరి పండిస్తే పంట చేతికొస్తది. వానాకాలంలో వానలు బాగా కురియడం వల్ల భూగర్భజలాలు చాలావరకు పెరిగాయి.

– వీరన్న, రైతు, రామచంద్రాపూర్ గ్రామం, మహబూబ్‌నగర్ రూరల్

ఆరోగ్య భాగ్యం

- **40 వేల** జనాభాకు కలిపి ఒక వైద్యుడు **ఉన్న పద్ధతి** నుంచి ఐదు వేల మందికి ఒక **వైద్యుడిని** అందుబాటులోకి తీసుకువచ్చే **విధానాన్ని** ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ **క్రమంలోనే** పల్లె, బస్తీ దవాఖానాల ఏర్పాటు **ముమ్మరంగా** సాగుతోంది. పల్లె **దవాఖానాలు** ఏర్పాటుతోపాటు వాటిలో **వైద్యుల నియా**మకం పూర్తయితే ప్రతి ఐదు వేల జనాభాకు ఒక వైద్యుడు అందుబాటులోకి వచ్చినట్లు అవుతోంది.'
- పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ సందర్భంగానే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు, పల్లె దవాఖానాల పేరిట సేవలు దరిచేరేలా చర్యలు తీసుకుంటోంది. అంతేకాకుండా సౌకర్యాలు కల్పించింది. తాజాగా పల్లెలతోపాటు పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పీహెచ్‌సీల్లో 15 మంది రెగ్యులర్, 36 మంది కాంట్రాక్టు పద్ధతిన వైద్యులను నియమించింది.



జడ్చర్లలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శివకాంత్

మెరుగైన వైద్యసేవల దిశగా ప్రభుత్వం అడుగులు

- జిల్లాలో 15 మంది రెగ్యులర్ వైద్యుల నియామకం
- అవుట్ సోర్సింట్, కాంట్రాక్టు పద్ధతిలో మరో 36 మంది మెడికల్ ఆఫీసర్లు
- పీహెచ్‌సీలు, అర్బన్ సెంటర్లకు కేటాయింపు
- ఇకపై సిఫార్సులకు చెక్‌పడనుందని ఆశాభావం

పాలమూరు: జిల్లావ్యాప్తంగా 129 సబ్ సెంటర్స్ ఉండగా వీటిలో 33 సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలు (హెల్త్ వెల్‌నెస్ సెంటర్)గా మార్పు చేయడం జరిగింది. వీటిలో ఇప్పటి వరకు ఐదు పల్లె దవాఖానాలను పూర్తి చేశారు. మిగిలిన వాటిని దశల వారీగా ఏర్పాటు చేయడానికి పనులు జరుగుతున్నాయి. అయితే వీటి నిర్వహణ కోసం ప్రభుత్వం ఇటీవల 36 మంది మెడికల్ ఆఫీసర్లను అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిన ఏర్పాటు చేసింది. దీంతో స్థానికంగానే మెరుగైన వైద్యసేవలు అందుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఖాళీలు లేకుండా సర్దుబాటు

జిల్లాలో ఉన్న 17పీహెచ్‌సీలకు, ఐదు అర్బన్ హెల్త్ సెంటర్లకు, ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు ఇటీవల 15మంది రెగ్యులర్ వైద్యులను నియమించింది. గతంలో రెగ్యులర్ మెడికల్ ఆఫీసర్లు 10 మంది ఉన్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చిన వారితో కలిపి మొత్తం రెగ్యులర్ వాళ్లు 25 మంది కావడం విశేషం. కొత్తగా వచ్చిన మెడికల్ ఆఫీసర్లు 15 మందిలో పేరూర్‌కు ఇద్దరు, మిడ్జిల్‌కు ఇద్దరు, అడ్డాకులకు ఒకరు, భూత్పూర్‌కు ఒకరు, దేవరకద్రకు ఇద్దరు, కోయిలకొండకు ఒకరు, హన్వాడకు ఒకరు, గండేడ్‌కు ఇద్దరు, కోత్లాబాద్‌కు ఒకరిని కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కొత్తగా కేటాయించిన మెడికల్ ఆఫీసర్లు అందరూ విధుల్లో చేరారు. మహబూబ్‌నగర్ పట్టణంలో ఉన్న ఐదు అర్బన్ హెల్త్ సెంటర్‌లకు ఒక్కొక్కరు మెడికల్ ఆఫీసర్లు వచ్చారు. జిల్లాలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎక్కడ కూడా ఖాళీలు లేకుండా ఆరోగ్యశాఖ అధికారులు సర్దుబాటు చేశారు. బాలానగర్ సీహెచ్‌సీ ఇటీవల వైద్య విధాన పరిషత్ పరిధిలోకి వెళ్లడం జరిగింది. పీహెచ్‌సీల్లో కేసీఆర్ కిట్ పథకం అమలు చేస్తుండటంతో ప్రసవాల కోసం వస్తున్నారు. ఇతర సేవలు సైతం అందుతున్నాయి.

పూర్తిస్థాయిలో లేక..

మొన్నటి వరకు పూర్తిస్థాయిలో వైద్యులు లేక రోగులకు సరైన వైద్యం అందడం లేదు. జిల్లాలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలు దయనీయంగా ఉన్నాయనే విమర్శలు మొదటి నుంచి వినిపిస్తున్నాయి. రూ.లక్షలు వెచ్చించి నిర్మాణం చేసిన ఆస్పత్రి రోగులకు సేవలు అందించలేని దుస్థితిలో నెలకొన్నాయి అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రతిరోజు గ్రామాలు, పల్లెలు, తండాల నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పదులు, వందల సంఖ్యలో రోగులు వివిధ ప్రాంతాల నుంచి వస్తుంటారు. చాలా సందర్భాల్లో పీహెచ్‌సీల్లో వైద్యులు లేకపోవడంతో రోగులు మళ్లిపోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ క్రమంలో కొత్త వైద్యుల నియామకంతో రోగులకు మెరుగైన సేవలు అందుతాయని భావిస్తున్నారు.

వైద్యులు వచ్చారు..

జిల్లాకు కొత్తగా 15 మంది రెగ్యులర్, 36 మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో మెడికల్ ఆఫీసర్లు వచ్చారు. దీంతో క్షేత్రస్థాయిలో రోగులకు వైద్యసేవలు పెరుగుతాయి. దీంతోపాటు పల్లె దవాఖానాలు సైతం ఏర్పాటు జరుగుతున్నాయి. సౌకర్యాలతోపాటు వైద్యులు పూర్తిస్థాయిలో ఉండటం వల్ల మెరుగైన సేవలు అందుతాయి.

– భాస్కర్‌నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ



కదిలే ఆలయం.. రథోత్సవం

- కనులపండువగా ఆదిదంపతుల కల్యాణం
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- అలంపూర్‌లో వైభవంగా మహాశివరాత్రి వేడుకలు

– అలంపూర్/ జోగుళాంబ శక్తిపీఠం/అలంపూర్ రూరల్

వివరాలు 10లో ▸

నిరంతర సాధనతో క్రీడల్లో విజయం



సీనియర్ వాలీబాల్ జట్టుతో శాంతికుమార్

మహబూబ్‌నగర్ క్రీడలు: నిరంతరం సాధన చేస్తేనే క్రీడల్లో విజయం సాధించవచ్చని జిల్లా వాలీబాల్ సంఘం అధ్యక్షుడు శాంతికుమార్ అన్నారు. వేములవాడ సిరిసిల్లలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ వాలీబాల్ టోర్నీలో చాంపియన్‌గా నిలిచిన జిల్లా పురుషుల జట్టును ఆదివారం జిల్లాకేంద్రంలో అభినందించి సన్మానం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో శాంతికుమార్ మాట్లాడుతూ వాలీబాల్‌లో రాణించే క్రీడాకారులకు తమవంతు ప్రోత్సాహం ఉంటుందన్నారు. జిల్లా వాలీబాల్ జట్లు రాష్ట్రస్థాయి టోర్నీల్లో మెరుగైన ప్రతిభ కనబరుస్తున్నట్లు చెప్పారు. వరుసగా మూడుసార్లు రాష్ట్రస్థాయి సీనియర్ వాలీబాల్ టోర్నీలో జిల్లా జట్టు చాంపియన్‌గా నిలవడం సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులు కోచ్‌ల సలహాలు పాటించి క్రమశిక్షణ, కష్టపడి ఆడి విజయాలు సాధిస్తున్నారన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా వాలీబాల్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి చెన్నవీరయ్య మాట్లాడుతూ 2019–20లో ఖమ్మం, 2020–21లో సిద్దిపేటతోపాటు తాజాగా వేములవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ వాలీబాల్ టోర్నీలో జిల్లా పురుషుల జట్టు చాంపియన్లుగా నిలిచినట్లు తెలిపారు. వాలీబాల్ క్రీడాకారులను శాంతికుమార్ ఎంతో ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ సంఘం చైర్మన్ లక్ష్మణ్, ఉపాధ్యక్షులు బాలస్వామి, బషీరుద్దీన్, సంయుక్త కార్యదర్శులు దస్తగిర్‌ఖాన్, సత్యనారాయణరెడ్డి, సమద్‌ఖాన్, యూసుఫ్, సుచేతన్‌రెడ్డి, క్రీడాకారులు యశ్వంత్‌కుమార్, సందీప్, మేరాజ్, ఫారుఖ్ తదితరులు పాల్గొన్నారు.

పరుగెత్తడంలో విఫలం

- 1600 మీ., పరుగులో వెనకబడుతున్న అభ్యర్థులు
- నాలుగు రోజుల్లో 1,310 మందే అర్హత



షాట్‌పుట్ విసురుతున్న ఓ అభ్యర్థి

మహబూబ్‌నగర్ క్రైం: కానిస్టేబుల్, ఎస్‌ఐ దేహదారుఢ్య పరీక్షల్లో అభ్యర్థులు అర్హత పొందడంలో చాలా వరకు విఫలమవుతున్నారు. హాజరైన వారిలో 50 శాతం వరకు ఇంటిముఖం పడుతున్నారు. నిత్యం సాధన చేసి పరీక్షలకు అనుగుణంగా శరీర ఆకృతిని మార్చుకున్న అభ్యర్థులే ముందుకు వెళ్తున్నారు. మరీ ముఖ్యంగా 1600 పరుగు పోటీలో అప్పటికప్పుడు మైదానంలో పరుగెడుతున్న అభ్యర్థులు అయితే ఒకటి లేదా రెండు రౌండ్లలోనే పరుగెత్తలేక విరమించుకుంటున్నారు. జిల్లా పోలీస్ శాఖ స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న కానిస్టేబుల్, ఎస్‌ఐ పరీక్షలకు మొత్తం 1,128 మంది హాజరు కావాల్సి ఉండగా వెయ్యిమంది హాజరు కాగా 349 మంది అభ్యర్థులు తుది పరీక్షకు అర్హత సాధించారు. దేహదారుఢ్య పరీక్షలను ఐపీఎస్ అధికారి యోగేష్ గౌతమ్, ఎస్పీ కె.నరసింహ, నోడల్ ఆఫీసర్ రాములు పర్యవేక్షించారు. 1600 పరుగు పోటీలో 600 మంది అర్హత పొందగా 400 మంది వెనుదిరిగారు. ఎత్తులో 518 మంది అర్హత పొందగా 82 వెనుదిరిగారు. గత నాలుగు రోజులుగా జరిగిన దేహదారుఢ్య పరీక్షల్లో మొత్తం 1,310 మంది అభ్యర్థులు అర్హత సాధించారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు చైర్మన్ కృష్ణయ్య అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని వాసవీ విద్యార్థి వసతి గృహం ఆవరణలో 2022–23 సంవత్సరానికి సంబంధించి రెండో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన చైర్మన్ కృష్ణయ్య మాట్లాడుతూ బ్యాంకు ప్రస్తుత ప్రగతి గురించి సభ్యులకు వివరించారు. బ్యాంక్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి దోమ దశరథ్ 2023- 24 సంవత్సరానికిగాను బడ్జెట్ ప్రవేశ పెట్టగా సమావేశానికి హాజరైన సభ్యులందరూ ఆమోదం తెలిపారు. సమావేశంలో బ్యాంక్ సీనియర్ ఉపాధ్యక్షులు కుమారస్వామి, కృష్ణయ్య, డైరెక్టర్లు సూర్యనారాయణ, శ్రీనివాస్, శివప్రసాద్, రవీందర్, అనిల్ వట్టెంవార్, తిరుపతయ్య, ఎ.కృష్ణయ్య, పద్మ, రజిత, బ్యాంక్ మేనేజర్ కుమారస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధితో సమూల మార్పులు



న్యూప్రేమ్‌నగర్‌లో ఓపెన్ నాలాను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పరుస్తూ సమూల మార్పులు తీసుకువస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. నాటికి, నేటికీ అభివృద్ధిలో వచ్చిన తేడాను గమనించాలని ప్రజలను కోరారు. ఆదివారం ఆయన స్థానిక పాలకొండ, ప్రేమ్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌నగర్‌లో మహిళా సామూహిక భవనం, పాలకొండలో నిర్మించిన రెండు షెడ్లను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్‌లోని మణికొండ స్థాయిలో పాలకొండ అభివృద్ధి చెందిందన్నారు. ఏ ఒక్క ఇంటినీ కూల్చకుండా రోడ్డు విస్తరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విశాలమైన రోడ్లు, తాగునీటి సౌకర్యం, డ్రెయినేజీ వ్యవస్థ, వీధి వ్యాపారులకు షాపులు, మినీ ట్యాంక్‌బండ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఒకప్పుడు సమస్యలను నిలయంగా ఉండే ప్రేమ్‌నగర్.. ఇప్పుడు అభివృద్ధికి చిరునామాగా మారిందన్నారు. హైవే స్థాయిలో విశాలమైన రోడ్లు, డ్రెయినేజీలు, కమ్యూనిటీ భవనాలు, హైమాస్ట్ లైట్లు, క్రీడాప్రాంగణాలు, స్వయం ఉపాధి కేంద్రాలు.. ఇలా అన్నింటినీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేవలం ఎన్నికలప్పుడు కులం, మతం పేరుతో కొందరు నాయకులు రాజకీయం చేస్తూ ఓట్లు దండుకున్నారని విమర్శించారు. కులం, మతం ముఖ్యం కాదని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే ప్రధానం అన్నారు. ఆయా కార్యక్రమాల్లో ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, వైస్ చైర్మన్ గణేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రహమాన్, కౌన్సిలర్లు నరేందర్, కిశోర్‌కుమార్, బాలీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్యాస్ సిలిండర్ పేలి మహిళ మృతి


కిష్టమ్మ (ఫైల్)

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి మహిళ సజీవ దహనమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, బంధువుల కథనం మేరకు.. మండలంలోని కొండపల్లికి చెందిన కుర్వ కిష్టమ్మ(55) గుడిసెలో ఉదయం వంట చేసేందుకు గ్యాస్ సిలిండర్ ఆన్ చేసింది. అయితే గ్యాస్ లీక్‌ను గమనించక వెలిగించడంతో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో మహిళ 80శాతం మంటల్లో కాలిపోయింది. గమనించిన స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ప్రమాదంలో మహిళ అక్కడిక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతురాలి భర్త రామ్మన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి బలవన్మరణం

అడ్డాకుల: మూసాపేట మండలంలోని నందిపేటకు చెందిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కురువ నాగశాలి(60) వ్యవసాయ పనులు చేసేవాడు. ఏడాది కిందట భార్య మొగిలమ్మ మృతిచెందింది. ఈ నెల 17న కుమారుడు, కోడలు పొలం వద్దకు వెళ్లగా, ఇంటి వద్ద ఉన్న నాగశాలి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆలస్యంగా ఇంటికి రాగా, వెంటనే గుర్తించి ఆటోలో చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆదివారం జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతుడు కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అనారోగ్య సమస్యలతో..

నాగర్‌కర్నూల్ క్రైం: అనారోగ్య సమస్యలతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉయ్యాలవాడకు చెందిన లక్ష్మయ్య(50) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు భార్య సుల్తానమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నందిమళ్లలో వివాహిత..

అమరచింత: పురుగుమందు తాగి ఓ వివాహిత మృతిచెందిన ఘటన మండలంలోని నందిమళ్లలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివనాగేశ్వరనాయుడు కథనం మేరకు.. గ్రామానికి చెందిన బోయ గోవిందు, రేణమ్మ (31) దంపతులు. వీరికి ఇద్దరు సంతానం. గ్రామంలో వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగించేవారు. కుటుంబ విషయాల్లో భార్యభర్తలు శుక్రవారం గొడవపడ్డారు. భర్త గోవిందు అన్న మాటలకు తీవ్ర మనస్థాపానికి గురైన రేణమ్మ శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగింది. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని సూచించడంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందింది. రేణమ్మ అన్న ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్‌ఐ వివరించారు.

యువకుడి మృతిపై కేసు నమోదు

మన్ననూర్: శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారిలో శనివారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో సందీప్(23) మృతి చెందిన సంఘటనలో కేసు నమోదు చేసినట్లు ఈగలపెంట ఎస్‌ఐ కృష్ణదేవ తెలిపారు. శనివారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి శ్రీశైలంకు బైక్‌పై రాజు, శ్రీను, సందీప్ వెళ్తుండగా వటువర్లపల్లి సమీపంలో శ్రీశైలం నుంచి వచ్చే కారు ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సందీప్ ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నదిలో పడి ఎద్దులు మృతి

ఉండవెల్లి: నదిలో పడి రెండు ఎద్దులు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కలుగోట్లకు చెందిన రైతు నాగసుందర్ ఎద్దుల బండిపై తుంగభద్ర నది నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సింగవరం గ్రామానికి వెళ్తున్నాడు. మెన్నిపాడు శివారులో తుంగభద్ర నది దాటుతుండగా మట్టిలో కూరుకుపోయి రెండు ఎద్దులు అక్కడికక్కడే మృతిచెందాయి. నాగసుందర్‌కు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. మృతిచెందిన ఎద్దుల విలువ రూ.లక్షా 50వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పండుగవేళ విషాదం

- ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు మృతి
- అలంపూర్ నుంచి బైక్‌పై వస్తుండగా ఢీకొట్టిన బొలెరో వాహనం
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ సృజన


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సృజన

అలంపూర్: పండగ వేళ ఓ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంతోషంగా గడిపి క్షణాలు రోడ్డు ప్రమాదం రూపంలో ఆవిరి చేశాయి. శనివారం రాత్రి చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంతో చీకట్లు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే.. మానవపాడు మండలం కొర్విపాడుకు చెందిన సాయికుమార్ గౌడ్ (17), స్నేహితులు రఫీ (18), చంద్రశేఖర్ (17) శనివారం రాత్రి 8 గంటల సమయంలో అలంపూర్ ఆలయానికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పారు. అలంపూర్‌లో ఆకాశ జ్యోతి దర్శనం అనంతరం ముగ్గురు రాత్రి 12 గంటల సమయంలో బైక్‌పై స్వగ్రామానికి తిరిగి బయలుదేరారు. ఉండవెల్లి మండలం బైరాపురం శివారులో కోళ్ల లోడ్‌తో రాంగ్ రూట్‌లో వస్తున్న బొలెరో వాహనం అతివేగంతో వారిని ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఉండవెల్లి ఎస్‌ఐ బాలరాజు తెలిపారు. సాయికుమార్ గౌడ్ తండ్రి ఈడిగా శేఖర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముగ్గురిది ఒకే గ్రామం..

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకులది ముగ్గురిది ఒకే గ్రామం. ఈడిగ శేఖర్‌గౌడ్, పద్మావతిలకు ఇద్దరు సంతానం. మొదటి సంతానం కుమార్తె కాగా రెండవ సంతానం సాయికుమార్ గౌడ్. శాంతినగర్‌లోని ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. గ్రామానికి చెందిన కొట్టం గోకారి మియ్య, అబేదాబేగం దంపతులకు ఇద్దరు కుమారులు. రఫీ రెండవ సంతానం అలంపూర్ చౌరస్తాలోని ప్రైవేట్ కళాశాలలో గతేడాది ఇంటర్ పూర్తి చేశాడు. మూగన్న, సుజాత దంపతులకు ముగ్గురు సంతానం కాగా కుర్వ చంద్రశేఖర్ చిన్నవాడు. ఇతను శాంతినగర్‌లోని ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ మూడు కుటుంబాల వారు గ్రామంలో వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఒకే గ్రామం కావడంతో తరుచూ కలిసి కబడ్డీ, క్రికెట్ ఆడుతుండటంతో స్నేహితులుగా ఉంటున్నారు. ముగ్గురు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబాలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాయి.


రఫీ(ఫైల్)


సాయికుమార్ (ఫైల్)


చంద్రశేఖర్ (ఫైల్)

పరిశీలించిన ఎస్పీ

ఉండవెల్లి మండలం బైరాపురం శివారులో రోడ్డు ప్రమాద స్థలాన్ని ఎస్పీ సృజన పరిశీలించారు. సంఘటన స్థలంలో ప్రమాద తీరును చూశారు. వివరాలను సీఐ సూర్యనాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. పూర్తి వివరాలు సేకరించి చర్యలు తీసుకోవాలన్నారు. వీరితోపాటు ఎస్‌ఐలు బాలరాజు, మహేందర్ ఉన్నారు.

స్నేహితులకు కన్నీటి వీడ్కోలు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకులకు స్నేహితులు, కుటుంబసభ్యులు, గ్రామస్తులు కన్నీటి వీడ్కోలు పలికారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి మృతదేహాలను అలంపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. గ్రామానికి మృతదేహాలు చేరుకోవడంతో ఒక్కసారిగా విషాదం అలుముకుంది. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. గ్రామస్తులు సైతం విద్యార్థులను తలుచుకుని కన్నీటిపర్యాంతమయ్యారు. అశ్రునయనాల మధ్య యువకుల అంత్యక్రియలు పూర్తి చేశారు.

ఎమ్మెల్యే పరామర్శ

సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే అబ్రహం ఆదివారం ఉదయం అలంపూర్ ఆస్పత్రికి వెళ్లి పోస్టుమార్టం గదిలో ఉన్న మృతదేహాలను పరిశీలించారు. ఆస్పత్రిలో ఉన్న కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రమాదంపై విచారణ చేసి బాధిత కుటుంబాలకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు.


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్రహం

ఎమ్మెల్యే పర్యటనలో అపశ్రుతి

- కొడంగల్ ఎమ్మెల్యే కాన్వాయ్‌లో కారు బోల్తాపడి యువకుడికి తీవ్రగాయాలు
- పరిస్థితి విషమం.. మహబూబ్‌నగర్‌కు తరలింపు


చెరువులో చెట్టును ఢీకొని ఆగిపోయిన కారు

కోస్గి: నారాయణపేట జిల్లా కోస్గి మండల పరిధిలో ఆదివారం కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పర్యటనలో అపశ్రుతి చోటుచేసుకుంది. కాన్వాయ్‌లో వెళ్తున్న ఓ కారు బోల్తాపడి ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. కోస్గి మండలంలోని పీసీతండాలో జరిగే రామన్న లింగేశ్వర జాతర ఉత్సవాలతోపాటు కబడ్డీ పోటీలకు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ క్రమంలో వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం అల్లీఖాన్‌పల్లికి చెందిన కావలి వెంకటయ్య సైతం కారులో వెళ్లాడు. ఎమ్మెల్యే కాన్వాయ్‌లో వెళ్తున్న క్రమంలో పీసీతండా సమీపంలోని చెరువు కట్టపై నుంచి కారు అదుపు తప్పి పల్టీలు కొట్టుకుంటూ చెరువులోకి దూసుకెళ్లి చెట్టుకు ఢీకొని ఆగిపోయింది. దీంతో వెంకటయ్యకు తీవ్ర గాయాలు కాగా కారులో ఉన్న మరికొందరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బాధితుడిని కోస్గిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే ఆస్పత్రికి చేరుకొని పరిశీలించారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

నదిలో వల చుట్టుకుని జాలరి మృతి

- అనాథలుగా మారిన ముగ్గురు పిల్లలు


శ్రీనివాసులు(ఫైల్)

అలంపూర్: ప్రమాదశాత్తు నదిలో పడి జాలరి మృతిన సంఘటనలో చోటు చేసుకుంది. ఈ సంఘటన పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెలుగువీధికి చెందిన పాలకుల శ్రీనివాసులు ఆదివారం తెల్లవారుజామున తుంగభద్ర నదిలో చేపల వేటలకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు వల కాళ్లకు చుట్టుకొని నదిలో పడిపోయాడు. చుట్టు పక్కల ఎవరూ లేకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. ఉదయం తుంగభద్ర నదిలో మృతదేహం బయటికి తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. తల్లి ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆరేళ్ల క్రితం మృతుడి భార్య అనారోగ్యంతో మృతి చెందింది. తల్లిదండ్రులు ఇద్దరు మృతి చెందడంతో పిల్లలు అనాథలుగా మారారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం


అడ్డాకుల వద్ద రోడ్డుపై పడిన క్షతగాత్రుడు, బైక్

అడ్డాకుల: జాతీయ రహదారిపై రాంగ్‌రూట్లో వచ్చిన ట్రాక్టర్ ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరో యువకుడు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటన మండల కేంద్రంలోని హైవేపై ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయకుమార్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ పట్టణంలోని షాషాబ్‌గుట్ట ప్రాంతానికి చెందిన గోపీకృష్ణ అలియాస్ రఘు(20) ల్యాబ్ టెక్నీషియన్‌గా శిక్షణ పొందుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన సాయికిరణ్ ప్రైవేట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఇద్దరు కలిసి ద్విచక్రవాహనంపై మహబూబ్‌నగర్ నుంచి కొత్తకోట మండలం పామాపురం వెళ్తున్నారు. అడ్డాకుల దాటిన తర్వాత హైవేపై కుమ్మరి నాగన్న ట్రాక్టర్ రాంగ్‌రూట్లో వెళ్తూ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనతో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు ఎగిరి రోడ్డుపై పడిపోయారు. రఘు తల పగిలిపోయి తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మరో యువకుడు సాయికిరణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చేరుకున్న పోలీసులు అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి వెంకటేశ్వర నివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా అడ్డాకుల వద్ద ఉన్న క్రషర్ కోసం వచ్చే వాహనాలతో పాటు ఇతర వాహనాలు ఇక్కడ నిత్యం రాంగ్‌రూట్లో వస్తుంటాయి. వీటి మూలంగా అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రాంగ్‌రూట్లో వాహనాలు వెళ్లకుండా తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

బైక్‌పై నుంచి పడి..

వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరి సమీపంలో ఆదివారం ఉదయం రామాపూరం చెందిన ఖాదర్ బైక్‌పై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. పెంట్లవెల్లి మండలం రామాపురం చెందిన మృతుడు తన పెద్దకుమారుడి వివాహం ఈ నెల 24వ తేదీన ఉండడంతో పెబ్బేరు మండలంలో తమ బంధువులకు పెళ్లి పత్రికలను ఇచ్చి తిరిగి రామాపురం వెళ్తుండగా బైక్ గోవర్ధనగిరి, వెలగొండ గ్రామాల మధ్య మూలమలుపులో అదుపుతప్పి కింద పడింది. దీంతో ఖాదర్ అక్కడికక్కడే మృతి చెందగా బైక్ నడుపుతున్న చిన్నకుమారుడు రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదాలకు కారణమవుతున్న మూలమలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేయాలని గోవర్ధనగిరి గ్రామస్తులు రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ రామన్‌గౌడ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి స్పీడ్ బ్రేకర్లు వేయించేందుకు కృషి చేస్తానని ఆందోళనకారులకు సర్ది చెప్పారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


ఆందోళన నిర్వహిస్తున్న గోవర్ధనగిరి గ్రామస్తులు గ్రామస్థులు

వేలిముద్రతో డబ్బులు కాజేస్తున్న వ్యక్తికి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రజితారెడ్డి

భూత్పూర్: వేలిముద్రతో డబ్బులు కాజేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రజితారెడ్డి తెలిపారు. ఆదివారం భూత్పూర్ సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జడ్చర్లకు చెందిన రాఘవేందర్ సీఎస్‌పీ మినీ బ్యాంక్ (కస్టమర్ సర్వీస్ పాయింట్) నిర్వహించిన అనుభవంతో డివైజ్, ఫింగర్ ప్రింట్ సహాయంతో భూత్పూర్, జడ్చర్ల, రాజాపూర్, మిడ్జిల్ మండలంలోని వివిధ గ్రామాలల్లో వృద్ధులను ఆసరా చేసుకొని పింఛన్ డబ్బులు రూ.2వేల నుంచి రూ.3వేలు అధికంగా వచ్చేటట్లు చేస్తామని చెప్పి, వారి ఆధార్‌కార్డు నంబరుతో పాటు వేలిముద్రను తీసుకొని డబ్బులు కాజేస్తుండేవాడు. భూత్పూర్ మండలంలోని తాటిపర్తి, గోప్లాపూర్‌లో రెండు చోట్ల ఇదే విషయం చెప్పి కొందరి డబ్బులు కాజేశాడు. విషయం తెలియడంతో భూత్పూర్ ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, సిబ్బందితో నిఘా పెట్టారు. ఆదివారం మండలంలోని పోతులమడుగులో రాఘవేందర్ వృద్ధులను మోసం చేస్తుండగా సమాచారం తెలిసింది. వెంటనే ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, కానిస్టేబుల్ వెంకటేష్ అతన్ని పట్టుకున్నారు. విచారణ చేయగా రాఘవేందర్ నుంచి రూ.50వేల నగదు, ఒక ఫింగర్ ప్రింట్, డివైజ్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. రాఘవేందర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

రాంపురంలో విగ్రహాలు చోరీ

పెబ్బేరు: మండల పరిధిలోని రాంపురంలోని ఆంజనేయస్వామి ఆలయంలోని ఉత్సవ విగ్రహాల చోరీ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనపై ఎస్‌ఐ జగదీశ్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 15న బుధవారం శివమాలధారణ చేసిన భక్తులకు ఇరుముడి కార్యక్రమం కోసం పూజారులు శ్రీరాములు, సీతాదేవి, లక్ష్మణుడు, హనుమంతుని ఉత్సవ విగ్రహాలను గర్భగుడి నుంచి బయటికి తెచ్చారు. పూజలు, ఇరుముడి కార్యక్రమాల అనంతరం అక్కడే వదిలి వెళ్లిపోయారు. మరుసటి రోజు గ్రామస్తుడు నడిపి లక్ష్మన్న ఆలయంలో శ్రీరాముడు, హనుమంతుని విగ్రహాలు కనిపించడం లేదని తెలియజేయడంతో గ్రామస్తులు పరిశీలించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించడంతో ఆదివారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. ఉత్సవ విగ్రహాల విలువ రూ.30వేలు వరకు ఉంటుందని పేర్కొన్నారు.

ఎరువుల వాడకం - చీడపీడల నివారణ

అలంపూర్: ఆహార ధాన్యాల ఉత్పత్తి సాధించడానికి తీసుకోవాల్సిన చర్యల్లో సమతుల సమగ్ర ఎరువుల యాజమాన్యం ముఖ్యమైంతి. అభివృద్ధి చెందిన దేశాలకన్న మన దేశంలో ఎరువుల వాడకం తక్కువగా ఉన్నప్పటికి పోషకాల సమతుల్యత సమగ్ర ఎరువుల వాడకం పాటించకపోవడం సమస్యగా మారిందని ఏడీఏ సక్రియ నాయక్ తెలిపారు. రాబోయే రోజుల్లో దేశ జనాభకు తగ్గట్టుగా 30వేల కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు అవసరం అవుతాయి. ఇందు కోసం నాలుగున్నర కోట్ల టన్నుల ఎరువులను అవసరం ఉంటుందని నిపుణుల అంచనా. ఆహార ఉత్పత్తిలో సమతుల సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటించాల్సిన అవశ్యకత నెలకొంటుంది.

సమతుల ఎరువుల వాడకం

పైరుకు కావాల్సిన పోషకాలు ఎక్కువ, తక్కువ కాకుండా అవసరమైన మేరకు అందుబాటులో ఉండే విధంగా అందించడాన్ని సమతుల ఎరువుల వాడకంగా ఏడీఏ పేర్కొన్నారు. దీనిపై అవగాహన లేకపోవడంతో నత్రజని వినియోగం అధికమై మిగిలిన పోషకాలు అశ్రద్ధ చేస్తున్నారన్నారు. దీని వలన నేల ఫలదత తగ్గిపోవడం, చౌడు బారడం, పైర్లు చీడపీడలకు సులభంగా గురికావడం వంటి పరిణామాలు ఏర్పడుతాయి. భూసార పరీక్షల ఆధారంగా సిఫారసు చేసిన ఎరువుల మోతాదులను వాడాల్సి ఉంటుంది.

సమగ్ర ఎరువుల వాడకం

రసాయన ఎరువులు, సేంద్రియ ఎరువులు, జీవన ఎరువుల ద్వారా తగిన రీతిలో పైర్లకు పోషకాలు అందించడాన్ని సమగ్ర ఎరువుల వాడకంగా పేర్కొంటారని తెలిపారు. పైరుకు సిఫార్సు చేసిన పోషక మోతాదులో మూడింట రెండు వంతులు రసాయన ఎరువుల ద్వారా, ఒక వంతు సేంద్రియ, జీవన ఎరువుల ద్వారా అందించినప్పుడు దీర్ఘకాలం పాటు భూసారం, ఫలదత, నేల ఆరోగ్యం కాపాడుతూ, అధిక దిగుబడి పొందవచ్చు. రసాయన ఎరువుల ద్వారా ముఖ్య పోషకాలు, సేంద్రియ ఎరువుల ద్వారా అన్ని పోషకాలు కొద్ది పరిమాణంలో లభ్యమవుతాయి. జీవన ఎరువులు గాలి నుంచి నత్రజని, నేల నుంచి భాస్వరం అందించడానికి దోహదపడటమేకాక మొక్కలకు కావాల్సిన హార్మోన్లు, ఎంజైములు అందించడానికి రసాయన ఎరువుల వల్ల కలిగే దుష్ఫలితాలను తగ్గించుకోవడానికి తోడ్పడతాయి.

నత్రజని

పురుగులు పంటపై దాడి చేసి నష్టం కలిగించడానికి నత్రజని వాడకానికి సంబంధం కనిపిస్తుంది. నత్రజని అధికంగా వేసినప్పుడు మొక్క ఏపుగా పెరిగి శాఖీయో ఉత్పత్తి బాగా జరిగి ఆకులు, కాడలు బిరుసుతనం కోల్పోయి మెత్తగా తయారై పురుగులు తినడానికి అనువుగా ఉంటుంది. పురుగులు బాగ వృద్ధి చెంది ఆకులను మొక్క ఇతర భాగాలను తిని నష్టం కలిగిస్తుంది. అంతే త్వరగా ఆకులు రావడానికి నత్రజని తోడ్పడుతుంది. అనేక పైర్లపై చేసిన పరిశోధనల్లో సిఫార్సు చేయబడిన మోతాదుకు మించి నత్రజని వాడకం వలన పురుగుల బెడద ఎక్కువైనట్లు తేలిందని తెలిపారు. నత్రజని వీలైనంత వరకు విభజించి వేయడం మంచిదని తేలింది. నత్రజని నెమ్మదిగా అందుబాటులోకి రావడానికి యూరియాను వేప పిండితో కలిపి వేయాలి. లేదా నిమిన్ వంటి వేప సంబంధిత కలిపి వాడవచ్చు.

భాస్వరం

దీని ప్రభావం చీడపీడల నివారణలో ప్రత్యక్షంగా కనిపించక పోయిన సమతుల్యత రీత్యా పరోక్షంగా ప్రముఖ పాత్ర వహిస్తుంది. అధిక నత్రజని వలన కలిగే దుష్ప్రయోజనాలను భాస్వరం తగ్గిస్తుంది. నత్రజని, భాస్వరం పూర్తి స్థాయిలో సమతుల్యంగా ఉన్నప్పుడు మొక్క రెండింటిని సమతుల్యంగా వినియోగించుకుంటుంది. మొక్క తొలిదశలో వేర్లు బాగా వృద్ధి చెందడానికి నేల నుంచి పోషకాలను బాగా తీసుకోవడానికి మొక్క ఆరోగ్యంగా ఉండటానికి తోడ్పడుతుంది. వీటి ఫలితంగా చీడపీడల తాకిడి తక్కువగా ఉంటుంది.


పొలంలో వేయడానికి సిద్ధంగా ఉన్న ఎరువులు

చీడపీడలను అరికట్టడంలో పోషకాల పాత్ర

రసాయన ఎరువుల వాడకానికి చీడపీడల ఉధృతానికి ప్రత్యక్ష సంబంధం లేనప్పటికి సమతుల, సమగ్ర ఎరువుల వాడకం ద్వారా పరోక్షంగా మొక్క చీడపీడలను నిలువరించి, శక్తి పొందడానికి ఎలాంటి సందేహం లేదు. ఎరువుల యాజమాన్యం లోపం వల్ల ఈ సమస్య తీవ్ర రూపం దాల్చుతుంది.

పొటాష్

చీడపీడల యాజమాన్యంలో పొటాష్ కీలక పాత్ర పోషిస్తుంది. తగినంత పొటాష్ అందించినప్పుడు మొక్కలో కొన్ని రకాల ఫినాలిక్ కాంపౌండ్స్ తయారై రక్షణగా ఉంటాయి. పొటాష్ అధికంగా ఉండే మొక్కల కణజాలం తినడానికి పురుగులకు రుచించదు. కణకవచం (సెల్‌వాల్) గట్టిగా తయారై దండెత్తే పురుగులకు అడ్డుగోడగా నిలుస్తుంది. వరి పైరులో చీడపీడలపై అధిక ప్రభావం చూపి సమర్థవంతంగా అరికడుతుంది. బ్యాక్టీరియా బూజు సంబంధమైన తెగుళ్లను 70 శాతానికిపైగా అరికడుతుంది. పురుగులు, మైట్స్ దాడి నుంచి 60 శాతానికిపైగా రక్షింపబడుతుంది. నెమటోడ్స్, వైరస్‌లు సైతం అధిక భాగంలో తగ్గుతాయి. ఆకుముడత, త్రిప్స్, దోమపోటు, దీపపు పురుగుల నుంచి కొంత వరకు రక్షణ ఉంటుంది. చెరుకు పైరుకు తగినంత పొటాష్ వేసినప్పుడు పొలుసు పురుగు (స్కేల్ ఇన్‌సెక్ట్), పత్తిలో ముక్కు పురుగు ఉధృతి బాగా తగ్గుతుంది. టమాట, మిరప, వంకాయ, బంగాలదుంప వంటి కూరగాయాల పైర్లకు తగినంత పొటాష్ పోషకాన్ని అందించినప్పుడు పురుగుల తాకిడి తక్కువగా ఉంటుంది. ప్రత్యేకించి రసం పీల్చే పురుగుల్లో ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తుంది. పొటాషియం శాతం అధికంగా ఉండే మామిడి మొక్కల్లో తేనె మంచు పురుగు దాడి అతి తక్కువగా ఉంటుంది. పొటాష్ వాడకం వలన చీడపీడలను అరికట్టడమేకాక పంట నాణ్యత, రంగు, రుచి, వాసన, రవాణాలో నిల్వ ఉండే గుణం పెరుగుతుంది. పైరుకు నీటి ఎద్దడి తట్టుకునే శక్తి కలిగిస్తుంది. సమతుల సమగ్ర ఎరువుల వాడకం వలన ఎరువుల ఖర్చు తగ్గుతుంది. చీడ పీడల నిరోధానికి తోడ్పడి పురుగు మందులు కావాల్సిన అవశ్యకతను తగ్గిస్తుంది. దీని ఫలితంగా నికర ఆదాయం పెరగడమే కాక వాతావరణ కాలుష్య నివారణకు దోహదపడుతుంది.

క్లుప్తంగా...

'ఏపీ ఇంధన పొదుపు'పై జర్మనీ అధ్యయనం

సాక్షి, అమరావతి: ఇంధన పొదుపు, సామర్థ్య కార్యక్రమాల్లో జాతీయ స్థాయిలో అవార్డులు సాధించిన ఆంధ్రప్రదేశ్.. తాజాగా అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. సోలార్, విండ్ తదితర పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ముమ్మరంగా చేపట్టడం, పరిశ్రమల్లో ఇంధన సామర్థ్య కార్యక్రమాల అమలు వంటి అంశాల్లో ఏపీ సాధించిన విజయాలు జర్మనీని ఆకర్షించాయి. వీటిపై అధ్యయనం చేయడానికి కన్సల్టెన్సీ ప్రైస్ వాటర్ కూపర్స్ (పీడబ్ల్యూసీ)ను.. జర్మన్ కార్పొరేషన్ ఫర్ ఇంటర్నేషనల్ కో–ఆపరేషన్ నియమించింది. ఈ అధ్యయనంలో భాగంగా పీడబ్ల్యూసీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ప్రభాత్ నేతృత్వంలోని బృందం రెండు రోజులుగా విజయవాడలో ఇంధన పరిరక్షణ మిషన్, నెడ్ క్యాప్ అధికారులతో చర్చిస్తోంది. పారిశ్రామిక రంగంలో ఏపీ సాధించిన విజయాలను అధ్యయనం చేస్తోంది. ఏపీ ఇంధన పరిరక్షణ మిషన్ 'టార్చ్ బేరర్' అంటూ ప్రభాత్ అభినందించారు.

23న టీడీపీలోకి కన్నా!

గుంటూరు మెడికల్: బీజేపీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ ఈ నెల 23న టీడీపీలో చేరనున్నట్లు తెలుస్తోంది. ఆదివారం గుంటూరులోని తన నివాసంలో కార్యకర్తలు, అనుచరులతో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయించుకున్నట్లు సమాచారం. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ బాధ్యతలు కన్నాకు అప్పగించే అవకాశాలున్నట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు.

పరమేశ్వరుడిని కించపరిచేలా ప్రచారమా?

వైఎస్సార్‌సీపీపై బీజేపీ నేతల విమర్శలు

సాక్షి, అమరావతి/ ఎంవీపీ కాలనీ (విశాఖ తూర్పు): అధికార వైఎస్సార్‌సీపీ అధికారిక ట్విటర్ ఖాతా ద్వారా పరమేశ్వరుడిని కించపరిచేలా ప్రచారం చేస్తోందని ఏపీ బీజేపీ తప్పుపట్టింది. ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహరావు తదితర నేతలు ఆదివారం వైఎస్సార్‌సీపీ వైఖరిపై విమర్శలు గుప్పించారు. ఏపీ వ్యాప్తంగా శివాలయాల వద్ద ఆందోళన చేపట్టాలని పిలుపునివ్వగా, అక్కడక్కడ బీజేపీ నేతలు శివాలయాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విశాఖలో జీవీఎల్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హిందువుల మనోభావాలను దెబ్బ తీస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బాల శివుని వేషధారణలో ఉన్న వీధి బాలుడికి పాలు పోస్తున్నట్లు ఫొటో రూపొందించడం దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలన్నారు.

మేనమామ మేలిమి 'కానుక'

ఏపీలో అత్యుత్తమంగా 'జగనన్న విద్యాకానుక'
- ఖరీదైన బ్యాగ్, మిలమిల మెరిసే బూట్లు
- ఆకర్షణీయంగా చెక్స్ యూనిఫామ్.. పెరిగిన క్లాత్ పరిమాణం
- రూ.1,042.53 కోట్లతో 40 లక్షల మందికిపైగా విద్యార్థులకు కిట్లు



సాక్షి, అమరావతి: ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని ఇనుమడింపచేస్తూ అందచేస్తున్న జగనన్న విద్యా కానుక (జేవీకే) కిట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మరింత నాణ్యతతో, సకాలంలో సమకూర్చేలా విద్యాశాఖ సన్నద్ధమైంది. రూ.1,042.53 కోట్ల వ్యయంతో 40 లక్షల మందికిపైగా విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందించేలా ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈసారి విద్యార్థులకు మరింత మన్నికతో కూడిన నాణ్యమైన బ్యాగ్‌లు, బూట్లను అందించనున్నారు. యూనిఫామ్‌ను ప్లెయిన్ క్లాత్ కాకుండా ఆకర్షణీయంగా రంగు రంగుల చెక్స్ డిజైన్‌తో రూపొందించారు. దుస్తులు కుట్టే సమయంలో సమస్యలు ఎదురు కాకుండా యూనిఫామ్ క్లాత్‌ను అదనంగా పెంచారు. ఇక పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్ ముద్రణ పనులు ఇప్పటికే ప్రారంభం కాగా ఈనెల 24వ తేదీ నుంచి జిల్లా పాయింట్లకు పంపిణీ మొదలవుతుంది. స్కూళ్లు తెరిచే రోజే వీటిని విద్యార్థులకు అందించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల పట్ల పెరుగుతున్న ఆదరణ, ఏటా అదనంగా చేరుతున్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ఐదు శాతం అదనపు బఫర్‌తో ప్రభుత్వం 5.06 కోట్ల పాఠ్యపుస్తకాలను ముద్రిస్తుండటం గమనార్హం. విద్యాకానుక ద్వారా అందించే ప్రతి ఒక్క వస్తువు నాణ్యతను స్వయంగా పరిశీలిస్తూ ఓ మేనమామలా ముఖ్యమంత్రి జగన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న విషయం తెలిసిందే. మూడున్నరేళ్లుగా జేవీకే అమలు తీరును గమనిస్తూ ఫీడ్ బ్యాక్ ఆధారంగా మార్పు చేర్పులను సూచిస్తున్నారు.

- స్థానిక మార్కెట్లో సుమారు రూ.650 విలువ చేసే నాణ్యమైన బ్యాగులను సరఫరా చేసేందుకు మంజీత్ ప్లాస్టిక్ ఇండస్ట్రీస్, కోర్స్ ఇండియా లిమిటెడ్, అభిలాష కమర్షియల్ ప్రైవేట్ లిమిటెడ్, ఎక్స్‌వో ఫుట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్, వినిష్మా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలను టెండర్ల ద్వారా ఎంపిక చేసి ఆర్డర్లు ఇచ్చారు. స్వీర్ టైపులో పెద్ద బ్యాగులు రీ డిజైన్ చేశారు.
- యూనిఫామ్‌కి సంబంధించి బాలికల టాప్, బాలుర షర్ట్‌లను ప్లెయిన్ క్లాత్ నుంచి చెక్స్ (గడులు) రూపంలోకి మార్పు చేశారు. దుస్తులు కుట్టే సమయంలో సమస్యలు ఎదురు కాకుండా క్లాత్ పరిమాణాన్ని కూడా దాదాపు 20 శాతం పెంచారు. మఫత్‌లాల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, నందన్ డెనిమ్ లిమిటెడ్, కంచన్ ఇండియా లిమిటెడ్, అరవింద్ కాట్సిన్ ఇండియా లిమిటెడ్, పదమ్ చంద్ మిలాప్‌చంద్ జైన్ సంస్థలను టెండర్ల ద్వారా ఎంపిక చేశారు.
- బూట్లు మరింత కాంతివంతంగా (షైనింగ్) ఉండేలా చర్యలు చేపట్టారు. సరఫరాదారులు పాత మెటీరియల్ వాడకుండా నియంత్రించారు. డైమండ్ ఫుట్‌కేర్ ఉద్యోగ్ ప్రైవేట్ లిమిటెడ్, మంజీత్ ప్లాస్టిక్ ఇండస్ట్రీస్, ఎక్సోట ఫుట్ వేర్ ప్రైవేట్ లిమిటెడ్, పవర్ టెక్ ఎలక్ట్రో ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్, లెహర్ ఫుట్‌వేర్ లిమిటెడ్ సంస్థలను టెండర్ల ద్వారా ఎంపిక చేసి పంపిణీ ఆర్డర్లు ఇచ్చారు.
- 1 నుంచి 9వ తరగతి వరకు బైలింగ్వల్ పాఠ్య పుస్తకాలు ప్రచురిస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా 6, 7, 9 తరగతుల విద్యార్థుల కోసం ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌తో బైలింగ్వల్ పాఠ్య పుస్తకాలు ముద్రిస్తున్నారు. తమిళనాడు న్యూ ప్రింట్ పేపర్స్ లిమిటెడ్ కాగితాన్ని సరఫరా చేస్తోంది. 40 లక్షల మందికిపైగా విద్యార్థులకు రెండు సెమిస్టర్ల విధానంలో పుస్తకాలు తయారు చేస్తున్నారు. దాదాపు 4.83 కోట్ల పుస్తకాలు ముద్రించి అందించనున్నారు.

రాజ్యాంగం పట్ల పాలకులకు చిన్నచూపు

ప్రముఖ జర్నలిస్టు, రచయిత సతీష్‌చందర్
- మనుస్మృతిని కాలరాయాలి: రచయిత్రి జూపాక సుభద్ర
- రాజ్యాంగ హక్కుల రక్షణ కోసమే జేఏసీ: ప్రజాకవి జయరాజ్



సతీష్‌చందర్‌తో పాటు పలువురిని అరెస్టు చేసిన దృశ్యం

ముషీరాబాద్: రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల పాలకులు చిన్నచూపు చూస్తున్నారని ప్రముఖ జర్నలిస్టు, రచయిత సతీష్‌చందర్ విమర్శించారు. ఆదివారం ఏజీ ఆఫీసు సమీపంలోని అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో భారత రాజ్యాంగం వర్సెస్ మనుస్మృతి అనే అంశంపై విజ్ఞాన దర్శిని ఆధ్వర్యంలో సెమినార్ జరిగింది. సతీష్ చందర్ మాట్లాడుతూ పాలకులు మనువాద పద్ధతుల్లో వ్యవహరిస్తున్నారని నిందించారు. వ్యతిరేకించే వారికి కూడా వ్యతిరేకత తెలిపే స్వేచ్ఛను రాజ్యాంగం ఇచ్చింది కానీ దాన్ని పాటిస్తామని వాగ్దానం చేసిన పాలకులే హక్కులకు భంగం కలిగిస్తున్నారని ఆరోపించారు. రచయిత్రి జూపాక సుభద్ర మాట్లాడుతూ మనుస్మృతిని అగ్రకుల మహిళలే ఎక్కువగా వ్యతిరేకించాలని, దళిత, బీసీలు కూడా మనుస్మృతిని కాలరాయాలని పిలుపునిచ్చారు. ప్రముఖ ప్రజాకవి జయరాజ్ మాట్లాడుతూ అంబేద్కర్, మార్క్స్, బుద్ధుడు చెప్పిన అంశాలు ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల రక్షణ కోసమే జేఏసీ ఏర్పడిందని తెలిపారు.

అకారణ అరెస్టులపై ఆగ్రహం

కాగా, రెండు రోజుల క్రితం అంబేడ్కర్‌పై హమారా ప్రసాద్ అనే వ్యక్తి చేసిన వ్యాఖ్యల పట్ల అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమానికి ఆందోళనకారులు పిలుపునిచ్చారు. ఈ సభికులు కూడా అక్కడికి వెళ్తారని భావించిన పోలీసులు సతీష్‌చందర్, జయరాజ్, సుభద్ర తదితరులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, వారికి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. తాము నిరసన కార్యక్రమానికి పిలుపు ఇవ్వలేదని, వారికీ తమకు సంబంధం లేదని చెప్పినప్పటికి పోలీసులు బలవంతంగా వ్యాన్‌లోకి ఎక్కించి నాంపల్లి, ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. అరెస్టయిన వారిలో సతీష్‌చందర్, జయరాజ్, సుభద్రతో పాటు విజ్ఞాన దర్శిని కన్వీనర్ రమేష్, జనార్ధన్, ఝాన్సీ, స్వరూప, దినకర్ శ్రీనివాస్, సైక్లాట్ బాబు, విజయ్‌కుమార్ తదితరులున్నారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై విడిచిపెట్టారు. ఈ సందర్భంగా సతీష్ చందర్ మాట్లాడుతూ పాలకులకు భారత రాజ్యాంగానికి రక్షకులు ఎవరో భక్షకులు ఎవరో తెలియక పోవడం విచారకరమని వ్యాఖ్యానించారు.

హిందువులంటే మీరేనా.. మేం కాదా?

- సీఎం ఎక్కడా, ఎప్పుడూ ఎవరినీ అగౌరవ పరచలేదు
- వైఎస్సార్‌సీపీ నేతల స్పష్టీకరణ

సాక్షి, అమరావతి/ సాక్షి నెట్‌వర్క్: 'మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా, అన్నార్తుల ఆకలి తీర్చడమే ఈశ్వర ఆరాధన అని చెబుతూ.. మా పార్టీ అఫీషియల్ ట్విటర్ ఖాతాలో ట్వీట్ చేసింది. రాష్ట్ర ప్రజలందరికీ శివయ్య చల్లని దీవెనలు ఉండాలని కోరుకుంటూ శుభాకాంక్షలు చెప్పింది. ఇందులో హిందువుల మనోభావాలు ఎక్కడ దెబ్బ తిన్నాయో అర్థం కావడం లేదు. ఆ ట్వీట్‌లో పరమ శివుడిని కించ పర్చినట్లు ఎక్కడ ఉందో చెప్పండి? బీజేపీ పూర్తిగా దిగజారి వక్రీకరిస్తోంది. శివరాత్రి రోజు బీజేపీ వాళ్లు శివాలయాలకు వెళ్లడం మర్చిపోయినట్లు ఉన్నారు. అందుకే ఈరోజు 'కోవెలకు వెళ్లాం' అంటూ ధర్నాలు చేపట్టారు' అని వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు.

హిందుత్వానికి మీరు పేటెంటా?

మతాన్ని రాజకీయాల్లోకి ఎందుకు లాగుతున్నారు? హిందుత్వానికి చాంపియన్స్ అన్నట్టు బిల్డప్ ఇస్తున్నారు. మీకన్నా హిందుత్వంపై ఎక్కువ ప్రేమ ఉన్నవారు, హిందుత్వ సంప్రదాయాలు పాటించే వారు వైఎస్సార్‌సీపీలో కోట్లాది మంది ఉన్నారు. 2014లో చంద్రబాబు విజయవాడ నడిబొడ్డన 40 ఆలయాలు పడగొడితే ఏం పీకారు? ఆ ప్రభుత్వంలో భాగమైన మీరు ఆ రోజు ఒక్క ధర్నా చేశారా? టీడీపీ హయాంలో రాష్ట్రంలో ఎన్ని గుళ్లు కట్టారో.. ఈ మూడున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ హయాంలో ఎన్ని గుళ్లు కట్టారో, ఎన్నింటిని పునర్నిర్మించారో చూడండి. బీజేపీ నాయకుడు సునీల్ థియోధర్ ట్వీట్ ఇన్సల్టింగ్‌గా ఉంది. అటువంటి వ్యక్తితో రాజకీయం చేస్తే ఇంకా దిగజారిపోతారు.

– కురసాల కన్నబాబు, మాజీ మంత్రి

నాడు గుడులు కూల్చినప్పుడు ఏమయ్యారు?

మతానికి రాజకీయ రంగు పులిమి పబ్బం గడుపుకుంటున్న దుర్మార్గ పార్టీ ఏదైనా ఉందంటే అది ఒక బీజేపీ మాత్రమే. ఓ సదుద్దేశంతో ట్విట్టర్‌లో వచ్చిన ఒక చిన్న క్యారికేచర్‌ను పట్టుకుని వక్ర భాష్యాలు వల్లిస్తూ రెచ్చిపోవడం బీజేపీ రాష్ట్ర నేతల దిగజారుడుతనానికి నిదర్శనం. మీరు టీడీపీతో అంటకాగినప్పుడు రాష్ట్రంలో 40 గుళ్లు కూల్చారు. అప్పుడు దేవదాయ శాఖ మంత్రిగా ఉన్న బీజేపీ నేత, ఇతర నేతలంతా ఎక్కడ నిద్రపోయారు?

– కొట్టు సత్యనారాయణ, డిప్యూటీ సీఎం



కన్నబాబు, కొట్టు సత్యనారాయణ, బొత్స

ఇందులో తప్పేముంది?

రాష్ట్రంలో బీజేపీ నాయకులు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి. మేమంతా హిందువులమే. ఆ ట్వీట్ ద్వారా మా మనోభావాలు ఏమీ దెబ్బతినలేదు. బీజేపీ వాళ్లకు ఏం ఇబ్బంది కలిగిందో అర్థం కావటం లేదు. ఆకలి అంటే దేవుడిని తలుచుకోవడం అందరికీ సహజం. రాష్ట్రంలో మనుగడ కోసం ఏమీ లేని చోట బీజేపీ మసిపూసి మారేడి కాయ చేస్తోంది. గతంలో వారే దేవాలయాలు కూల్చి వారే ధర్నాలు, నిరసనలు చేశారు. ఇలాంటి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి.

– బొత్స సత్యనారాయణ, విద్యా శాఖ మంత్రి

బీజేపీ దిష్టికళ్లతో చూడటం మానాలి

అన్నార్తులకు అన్నం పెడితే, దాన్ని కూడా మతం దృష్టిలో చూసే దిష్టి కళ్లు బీజేపీవి. దేవుళ్లను రాజకీయాలకు వాడుకునే బీజేపీకి భక్తి గురించి ఏ మాత్రం తెలియదు. ఇలాంటి విషయాన్ని రాజకీయం చేయడం దుర్మార్గం.

– బాలినేని శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి

కళాశాల మెట్లు కూలి విద్యార్థులకు గాయాలు

సూర్యాపేటలోని భవిత జూనియర్ కళాశాలలో ఘటన



కూలిన భవిత జూనియర్ కళాశాల మెట్లు

సూర్యాపేటటౌన్: కళాశాల భవనం మెట్లు కూలి పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ల రోడ్డులో ఉన్న భవిత జూనియర్ కళాశాలలో 100 మంది వరకు విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ చదువుతున్నారు. భవనం కింది భాగంలో తరగతులు, పై అంతస్తులో హాస్టల్‌ను నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగానే సాయంత్రం స్టడీ అవర్స్ అయిపోగానే విద్యార్థులు ఎవరి రూమ్‌కు వారు వెళ్లిపోయారు. కాగా, శివాజీ జయంతి ఉత్సవాల నిర్వాహకులు రోడ్డుపై ర్యాలీ నిర్వహిస్తుండటంతో విద్యార్థులు ఒక్కసారిగా హాస్టల్ రూమ్‌ల నుంచి బయటకు వచ్చి మొదటి అంతస్తు మెట్లపై నిలబడి చూస్తున్నారు. అయితే ఆ భవనం శిథిలావస్థలో ఉండటంతో మెట్లు కూలి సైడ్‌వాల్ ఒకవైపు ఒరిగిపోయింది. దీంతో 12 మంది విద్యార్థులు ఒకరిపై ఒకరు కిందపడిపోయారు. అక్కడ ఉన్న సిబ్బంది, తోటి విద్యార్థులు.. గాయపడిన విద్యార్థులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆదివారం రాత్రి మంత్రి జగదీశ్‌రెడ్డి పరామర్శించారు. తీవ్ర గాయాలైన వారికి వెంటనే మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఆర్డీఎస్‌లో అడుగంటిన నీరు

- పంటలు ఎండిపోతున్నాయని రైతుల ఆందోళన



శాంతినగర్: నియోజకవర్గ రైతుల ప్రధాన సాగునీటి వనరైన ఆర్డీఎస్ కెనాల్‌లో నీటి ప్రవాహం అడుగంటింది. దీంతో కెనాల్ కింద పంటలు సాగుచేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆర్డీఎస్ కెనాల్ ఆయకట్టు కింద యాసంగిలో 35వేల ఎకరాల్లో రైతులు పంట సాగు చేశారు. మొక్కజొన్న, సీడ్ జొన్న, వరి, మినుము పంటలు కంకి దశలో ఉన్నాయి. పంట దిగుబడి రావాలంటే కంకి దశలో నీటి తడులు ఇవ్వడం తప్పనిసరి. నీరు పూర్తిస్థాయిలో అందలేదంటే పంటలు ఎండిపోవడం, గింజలు తాలుపోవడం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్నాటక రాజోళిబండ నుంచి వచ్చే నీరు డి–24 వరకు వచ్చే సరికి పూర్తిగా నిలిచిపోతున్నాయి. దీంతో గతంలో పంటలు ఎండిపోవడం, రైతులు పంటలు నష్టపోవడం పరిపాటిగా మారేది. నాలుగేళ్ల కిందట నిర్మించిన తుమ్మిళ్ల లిఫ్ట్ నీటితో పంటలకు ఊపిరిపోశారు. పంటలు చివరిదశలో ఉన్న తరుణంలో తుంగభద్ర నదిలో నీటి నిల్వలు లేని కారణంగా లిఫ్ట్ మోటార్‌ను అధికారులు శనివారం నిలిపివేశారు. దీంతో కెనాల్‌లో నీటి ప్రవాహం పూర్తిగా నిలిచిపోయింది. స్పందించిన ఆర్డీఎస్ అధికారులు ఎగువన ఉన్న డిస్ట్రిబ్యూటరీలను కొంతమేర మూసి వేసి దిగువకు నీటిని అందించాలనే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో ఆదివారం జూలెకల్ శివారులోని ప్రధాన కాల్వలో రెండడుగుల మేర నీటి ప్రవాహం కొనసాగుతోంది. మెయిన్ కెనాల్‌లో నీటి ప్రవాహం తగ్గడంతో డిస్ట్రిబ్యూటరీలు, సబ్ డిస్ట్రిబ్యూటరీలకు సాగునీరందడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై ఆర్డీఎస్ ఉన్నతాధికారులు స్పందించి టీబీ బోర్డులో తెలంగాణకు రావాల్సిన ఇండెంట్ పెట్టి వెంటనే తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్‌ను ఆన్‌చేసి సాగునీటిని అందించాలని రైతులు కోరుతున్నారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం పూర్తిస్థాయి నీటి మట్టం 1,020 అడుగులు ఉందని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. సమాంతర కాల్వకు 750 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా.. ఎన్టీఆర్ కాల్వకు 10 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని వివరించారు.

కదిలే ఆలయం.. రథోత్సవం

- కనులపండువగా ఆదిదంపతుల కల్యాణం
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- అలంపూర్‌లో వైభవంగా మహాశివరాత్రి వేడుకలు



రథం ముందు గుమ్మడికాయ కొడుతున్న ఈఓ పురందర్‌కుమార్

అలంపూర్/ జోగుళాంబ శక్తిపీఠం/ అలంపూర్ రూరల్: అలంపూర్ ఆలయాల్లో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం మూడోరోజుకు చేరుకున్నాయి. తెల్లవారుజామున రెండు గంటలకు ప్రారంభమైన జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి శాంతి కల్యాణం నాలుగు గంటలకు ముగిసింది. ఉదయం వాహనసేవ నిర్వహించి ప్రదోశకాలంలో రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈఓ పురందర్‌కుమార్, ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి గుమ్మడికాయ కొట్టి రథాన్ని ప్రారంభించారు. అంతకుముందు వేద పండితులు అక్బర్‌పేటకాలనీలో రథాంగ హోమం నిర్వహించారు. తరతరాలు గా వస్తున్న సంప్రదాయం ప్రకారం గ్రామపెద్దలు కొత్త ధాన్యాన్ని రథంపైకి చల్లారు. రథం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి ముందుకు కదిలించారు.

- కదిలే దేవాలయానికి ప్రతీకే రథోత్సవమని ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ రథోత్సవ వైవిష్యాన్ని వివరించారు. రథంలో విహరించే పార్వతీ పరమేశ్వరులను దర్శించుకుంటే పునర్జన్మ ఉండదని శాస్త్రం చెబుతోందని తెలిపారు. కాళ్లు, చేతులు స్వాధీనంలో ఉన్నప్పుడే భగవంతుడిని భక్తితో దర్శించాలని సూచించారు. అనారోగ్యం, నడవలేని స్థితి, అజ్ఞానం, నాస్తికత్వంతో ఆలయాలకు వెళ్లలేని వారు, జంతుజన్మ ఎత్తి భగవంతుడిని దర్శించలేని వివిధ ప్రాణులను బాలబ్రహ్మేశ్వరుడు రథోత్సవ రూపంలో అనుగ్రహిస్తారని వివరించారు. రథోత్సవం చూస్తేనే పునర్జన్మ ఉండదని శాస్త్రం చెబుతుంటే.. నేరుగా రథోత్సవంలో పాల్గొనే వారికి ఎంత పుణ్యం లభిస్తుందో గమనించాలన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



రథంపై ఆది దంపతులు

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు..
(ఇన్‌సెట్లో) శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో శనివారం రాత్రి శివపార్వతుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని భక్తమార్కండేయ శివాలయం, పల్కపల్లి భవానీ రామలింగేశ్వర ఆలయంలో కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహన రథంలో ఊరేగింపుతో ఆలయానికి తీసుకువచ్చారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షుడు కందూరి సుధాకర్, ఈఓ శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

ఖిల్లా కోట అద్భుతం

కోయిల్‌కొండ: జిల్లాలో ప్రసిద్ధి చెందిన కోయిల్‌కొండ బీబీపాతిమా ఖిల్లా కోట అద్భుతంగా ఉందని ఆరోగ్య వాకింగ్ సభ్యులు శేఖర్‌గౌడ్, నాగేశ్‌సాగర్, మేఘారెడ్డి అన్నారు. ఆదివారం ఆరోగ్య వాకింగ్ బృందం 50మందితో కలిసి ఖిల్లా కోటను సందర్శించి చరిత్రను తెలుసుకున్నారు. ఖిల్లాకోటను ప్రభుత్వం మరింత అభివృద్ధి చేస్తే పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటుందన్నారు. ఉమ్మడి జిల్లాలో ఐదు కొండలను సందర్శించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య వాకింగ్ సభ్యులు చిన్న, కృష్ణ, గోపి, జగన్, పాండు, శ్రీను, రమేష్, శంకర్ తదితరులు ఉన్నారు.



ఉత్సాహంగా జీబీపీఎల్–5 క్రికెట్ టోర్నీ



జీబీపీఎల్ టోర్నీ ప్రారంభోత్సవంలో బ్యాటింగ్ చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ క్రీడలు: సంత్ సద్గురు సేవాలాల్ మహరాజ్ 284వ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రం పిల్లలమర్రి సమీపంలోని ఎండీసీఏ మైదానంలో గోర్ బంజారా ప్రీమియర్ లీగ్ స్పోర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీబీపీఎల్–5 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బ్యాటింగ్ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో అధునాతనమైన క్రికెట్ స్టేడియాన్ని నిర్మిస్తామని తెలిపారు. మహబూబ్‌నగర్‌ను క్రీడాకారులకు స్వర్గధామంగా మారుస్తామని తెలిపారు. క్రీడలతో మానసికంగా ధృడంగా ఉండవచ్చని అన్నారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తితో ఆడాలని పిలుపునిచ్చారు. గిరిజన సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ నేతృత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో 200గజాల స్థలంలో బంజారా భవన్, సేవాలాల్ విగ్రహం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు హనుమానాయక్, మున్సిపల్ చైర్మన్ కేసీ.నర్సింలు, వైస్ చైర్మన్ గణేష్, ముడా చైర్మన్ గంజి వెంకన్న, జీబీపీఎల్ ఆర్గనైజర్లు రామావత్ రవిరాథోడ్, బావాజీ రంగనాయక్, కిషన్ పవార్, శేఖర్, సంతోష్, బొట్టు వెంకట్, చందర్ రాథోడ్, కొర్ర వీరేశ్, భాను రాథోడ్, రఘు రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. జీబీపీఎల్ మొదటి మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ స్ట్రైకర్స్ జట్టు 27 పరుగుల తేడాతో రాథోడ్ రాకర్స్ జట్టుపై విజయం సాధించింది. రెండో మ్యాచ్ భవాని లెవన్ జట్టు 36 పరుగుల తేడాతో రాజునాయక్ తండా జట్టుపై గెలుపొందింది.

ఇథనాల్ కంపెనీతో జలాలు కలుషితం



కొత్తపల్లిలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ విజయ్

మదనాపురం: మరికల్ మండలం చిత్తనూరు శివారులో నిర్మిస్తున్న ఇథనాలు కెమికల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా తొమ్మిది రోజులుగా బాధిత గ్రామాల ప్రజలు పాదయాత్ర చేపట్టారు. ఆదివారం మదనాపురం మండలంలోని దుప్పల్లి కొత్తపల్లి గ్రామాలకు పాదయాత్ర చేరింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు ప్రొఫెసర్ కె.వై.రత్నం, ప్రొఫెసర్ జి.విజయ్, ప్రొఫెసర్ జోబి జోసెఫ్ తదితరులు పాదయాత్రలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఇథనాల్ కెమికల్ ఫ్యాక్టరీ వల్ల ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేదని, పెట్టుబడిదారుల ప్రయోజనం కోసమేనని వెల్లడించారు. ఇథనాల్ కెమికల్ ఫ్యాక్టరీ స్థాపించే విధంగా పార్లమెంటులో చట్ట సవరణ చేసుకోవడం మోదీ ప్రభుత్వం ప్రజలకు చేసిన ద్రోహమైన చర్య అని ఆరోపించారు. ఈ ఫ్యాక్టరీ పెట్టడం వల్ల ఆ ప్రజలకు సాగునీరు, తాగునీరు, వాతావరణం కాలుష్యం అవుతుందన్నారు. క్యాన్సర్ వంటి భయంకరమైన రోగాల బారిన పడి మరణిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిత్తనూరు ఎక్లాస్‌పూర్, రాంపూర్, కన్మనూరు గ్రామాల ప్రజలతో పాటు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు బండారి లక్ష్మయ్య, బండారి నరసప్ప, చక్రవర్తి, నాగరాజు, గోవింద్, మహదేవ్, వెంకటయ్య పాల్గొన్నారు.